
సాక్షి ఒడిశా

సోమవారం । 9 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,93,857లు, బంగారం 3.5 గ్రాములు, వెండి 191.2 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- 8లో



ఉద్యోగిని మృతితో ఉద్రిక్తత

- 8లో

న్యూస్‌రీల్

అనుమానాస్పదంగా వస్తువుల దగ్ధం



అడవిలో దగ్ధమైన గృహోపకరణాలను పరిశీలిస్తున్న స్థానికులు

కొరాపుట్: దట్టమైన అడవిలో ఎంతో ఖరీదైన గృహోపకరణ వస్తువులు దగ్ధమైన ఘటన సంచలనంగా మారింది. నవరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి టిమన్‌పూర్ పంచాయతీ బినయ్‌పూర్ అటవీ ప్రాంతంలో ఈ విషయాన్ని గిరిజనులు ఆదివారం గుర్తించారు. ఎంతో విలువైన కొత్త బీరువాలు, ఫ్యాన్లు, కూలర్లు, స్టాండ్లు, కుక్కర్లు, మిక్సీలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. వీటిలో చాలా వస్తువులు పూర్తి దగ్ధం కాగా, మరికొన్ని చెక్కు చెదరకుండా ఉన్నాయి. సాధారణంగా జన సంచారానికి దూరంగా ఉండే ఈ ప్రాంతంలో ఇలా వస్తువులు దగ్ధం కావడం మిస్టరీగా మారింది. ఘటన జరిగిన ప్రాంతానికి కూతవేటు దూరంలోనే ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు ఉంది.

పర్లాకిమిడిలో తిరుప్పావై ప్రవచనాలు



పాశురాలను వివరిస్తున్న పండితులు భద్రం శ్రీనివాసాచార్యులు

పర్లాకిమిడి: తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంలో పర్లాకిమిడి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా అళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు తిరుప్పావై ప్రవచనాలు గత 22 రోజులుగా కొనసాగుతున్నాయి. ఆదివారం జరిగిన కార్యక్రమంలో యుద్ధభూమిలో భీష్మునికి శ్రీకృష్ణుడు ప్రసాదించిన భక్తి, ముక్తిమార్గాన్ని వేద పండితులు భద్రం శ్రీనివాసాచార్యులు వివరించారు. అలాగే ఈనెల 14 భోగీ వరకు ప్రవచనాలు కొనసాగనున్నాయని, అదే రోజు గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

ఆహార కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు



ఆహార కేంద్రంలో భోజనం చేస్తున్న సబ్ కలక్టర్ కుహోరో

రాయగడ:

జిల్లాలోని గుణుపూర్ కొత్త బస్టాండ్ వద్ద పేదల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆహార కేంద్రాన్ని సబ్ కలెక్టర్ లలితకుమార్ కుహారో శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్రప్రభుత్వం రూ.5 లకే పేదల కోసం ఆహారాన్ని అందిస్తున్న నేపథ్యంలో నాణ్యతను పరిశీలించారు. గుణుపూర్ బీడీఓ శాంతిప్రభ ప్రధాన్, తహసీల్దార్ శరత్‌చంద్ర నాయక్, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి ప్రభాతి జొడియా, న్యాయవాది రమేష్‌చంద్ర లిమ్మ, జీఐఈటీ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు డాక్టర్ చంద్రధ్వజ పండా తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోనే భోజనం చేసిన అధికారులంతా నాణ్యత లేని ఆహారాన్ని అందించడంతో నిర్వాహకులపై అసహనం వ్యక్తంచేశారు. మార్కెట్‌లో ప్రస్తుతం కూరగాయలు తక్కువ ధరకే లభిస్తున్నప్పటికీ డల్మా(పప్పు)లో కనీసం కూరగాయల జాడ కనిపించడం లేదని ప్రశ్నించారు. రోజూ సుమారు 500 మందికి ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో కనీసం రోజుకు 100మంది రావడం లేదు. అయితే 500మంది రోజూ భోజనం చేస్తున్నట్లు మున్సిపాలిటీ వారికి లెక్కలు చూపిండంపై సబ్ కలెక్టర్ నిలదీశారు. నాణ్యమైన భోజనాన్ని పేదలకు అందివ్వాలని నిర్వాహకులను ఆదేశించారు.

ఆట.. ఆరంభం

- అట్టహాసంగా ప్రారంభమైన చొయితి వార్షిక క్రీడోత్సవాలు
- ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ వివేకానంద శర్మ
- ఈనెల 12 వరకు కొనసాగనున్న క్రీడల పోటీలు
- 18న విజేతలకు బహుమతులు అందజేత



క్రీడోత్సవాల్లో ప్రసంగిస్తున్న ఎస్పీ వివేకానంద శర్మ, పక్కన ఎమ్మెల్యే ముదులి



కబడ్డీ ఆడుతున్న మహిళలు



చీర్‌గర్ల్స్ సందడి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగన్నాథ సరక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ వివేకానంద శర్మ

రాయగడ:

పట్టణంలోని మహిళా కళాశాల మైదానంలో వార్షిక చొయితి క్రీడోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ ముఖ్య అతిథిగా హాజరై, క్రీడోత్సవాలకు అంకురార్పన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా జిల్లా యంత్రాంగం సంప్రదాయంగా నిర్వహించే చొయితి ఉత్సవాలను గత రెండేళ్లుగా కరోనా కారణంగా దూరమయ్యాయని గుర్తుచేశారు. ఆదివాసీల సంస్కృతికి అద్దం పట్టే ఉత్సవాలను ఈ ఏడాది అంతా కలసికట్టుగా జరుపుకొనే అవకాశం వచ్చిందన్నారు. ఇందులో భాగంగా వివిధ క్రీడల పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించి, విజేతలుగా నిలిచిన వారికి ఈనెల 18 నుంచి రాయగడ గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న చొయితి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందించనున్నట్లు ప్రకటించారు. క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు క్రీడాభిమానులకు ఆనందాన్నిచ్చే ఉద్దేశంతో చొయితి క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా ఏటా చొయితి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివాసీ సంస్కృతికి అద్దం పట్టే విధంగా జరిగే ఈ ఉత్సవాలను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్ అర్చన పట్నాయక్, డీకే మహంతి తదితరులు పాల్గొన్నారు.

తొలి పోరు కూతదే..

చొయితి క్రీడోత్సవాలు కబడ్డీ పోటీలతో ప్రారంభమయ్యాయి. మహిళల మధ్య జరిగిన ఈ పోటీలు ఆద్యంతం ప్రేక్షకులను రంజింపజేశాయి. మధ్యమధ్యలో చీర్ గర్ల్స్ సందడి చేశారు. బచపన్, అంగన్‌వాడీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అంగన్‌వాడీ జట్టు 12 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. క్రీడోత్సవాల్లో భాగంగా ఈనెల 9న స్థానిక బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో స్లో సైకిలింగ్, 10న సీనియర్ సిటిజన్ల మధ్య నడక పోటీలు, 12న బాలుర కబడ్డీ, వాలీబాల్, థగ్ ఆఫ్ వార్ తదితర పోటీలు జరుగనున్నాయి.

ఇబ్బందులు లేకుండా చూడాలి..

రెండేళ్ల విరామం అనంతరం నిర్వహిస్తున్న చొయితి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అంతా సహకరించాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన చొయితి ఉత్సవ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 5 రోజుల కొనసాగనున్న ఈ ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. దీనికి అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఇప్పటి నుంచే ప్రణాళికతో ఉత్సవాలు విజయవంతమయ్యేలా చూడాలన్నారు. రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని కార్యక్రమాలను త్వరగా ముగించే విధంగా చూడాలని వివరించారు. సమావేశంలో కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ, సబ్ కలెక్టర్ భీమసేన్ సాబోరో, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సేవలు రద్దయితే చార్జీలు చెల్లించాల్సిందే

- విమానయాన సంస్థకు వినియోగదారుల ఫోరం ఆదేశం



భువనేశ్వర్: విమాన సేవలు రద్దయితే టికెట్ చార్జీలు తిరిగి చెల్లించాల్సిందేనని వినియోగదారుల ఫోరం ఆదేశించింది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న విమాన టిక్కెట్లను సేవలు రద్దు చేసిన నేపథ్యంలో ఖాతాదారులు/ప్రయాణికులకు డబ్బులు తిరిగి ఇవ్వాలని స్పష్టం చేసింది. వినియోగదారులకు సరైన సేవలు అందించనందుకు ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీ, ప్రైవేట్ విమానయాన సంస్థ బాధితునికి పరిహారం చెల్లించాలని తెలిపింది. ఈ వివాదం పురస్కరించుకుని పూర్వాపరాలు పరిశీలించిన వినియోగదారుల ఫోరం రూ.లక్ష పరిహారం చెల్లించాలని ఆదేశించడం విశేషం. 30 రోజుల్లోగా టికెట్ చార్జీ రూ.4,289తో పాటు రూ.లక్ష నష్ట పరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల వివాదం పరిష్కార కమిషన్ ఆదేశించింది. ఆన్‌లైన్ ట్రావెల్ కంపెనీలు, ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ రెండూ దరఖాస్తుదారునికి ఈ మొత్తాన్ని చెల్లించాలని కమిషన్ స్పష్టంచేశారు. 2020 నవంబర్ 2న భువనేశ్వర్ నుంచి ఢిల్లీకి వెళ్లేందుకు పిటీషనర్ ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా అక్టోబర్ 28న టికెట్ బుక్ చేసుకున్నట్లు కేసు వివరాలు వెల్లడయ్యాయి. అయితే ఢిల్లీకి వెళ్లే ముందు పిటిషనర్‌కు విమానయాన సంస్థ నుంచి టికెట్ రద్దుపై మెసేజ్ వచ్చింది. దీనిపై పిటిషనర్ వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయగా, 2021లో కమిషన్ ముందు హాజరయ్యారు. కమిషన్ ప్రెసిడెంట్ దేబాశిష్ నాయక్, సభ్యుడు శివానంద మహంతి, జ్యూరీ ఆనంద్‌కుమార్ ముంద్రా విచారణ నిర్వహించారు. ఇరుపక్షాల వాదోపవాదాలు విన్న అనంతరం పిటిషనర్ మానసిక వేదన, వాజ్యం ఖర్చులతో సహా నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించారు.

విమాన సేవలు పునరుద్ధరణ

ఝార్సుగుడ–ముంబై మధ్య విమానయాన సేవలు పునరుద్ధరించనున్నారు. ఈనెల 12 నుంచి ఈ రెండు ప్రాంతాల మధ్య విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. గతంలో కల్పించిన ఈ సేవలను తాత్కాలికంగా నిలిపి వేయగా, స్పైస్ జెట్ సంస్థ దీనిని పునరుద్ధరించనుంది.

సంబల్‌పూర్ వీసీగా బిధుభూషణ్ మిశ్రా



బిధుభూషణ్ మిశ్రా

భువనేశ్వర్: సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం నూతన వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ బిధుభూషణ్ మిశ్రా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ అధికారిక ఉత్తర్వులు జారీచేశారు. ఈ పదవిలో ఆయన నాలుగేళ్ల కొనసాగనున్నారు. ఇప్పటి వరకు మిశ్రా యూనివర్సిటీ ఆఫ్ ఉటాలో వాణిజ్య విభాగాధిపతిగా ఉద్యోగ విరమణ చేశారు. అలాగే 9 పుస్తకాలను ఆయన రచించడంతో పాటు వివిధ సందర్భాల్లో 122 వ్యాసాలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ సంబల్‌పూర్ పురాతన సంస్కృతి ప్రోత్సాహానికి విశ్వవిద్యాలయం ప్రాముఖ్యత ఇస్తోందని తెలియజేశారు. గతంలో సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ సంజీవ్ మిట్టల్ అనేక వివాదాల్లో చిక్కుకుని రాజీనామా చేయడంతో ఈ స్థానం ఖాళీ అయ్యింది.

ఆత్మీయ సమ్మేళనం



కలెక్టర్ కమలోచన్ మిశ్రాతో కలెక్టరేట్, రెవెన్యూ ఉద్యోగుల కుటుంబాలు

కొరాపుట్: నిత్యం ప్రజా వినతులు, ఆందోళనలు, కృతజ్ఞతలు, వివాదాలతో క్షణం తీరిక లేకుండా ఉద్యోగ జీవితాన్ని సాగించే కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది ఆట విడుపుగా ఓ చోట సమావేశమయ్యారు. నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని హిర్లి పర్వతం వద్ద జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం సహకారంతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా, ఆయన సతీమణి బబితా మిశ్రా హాజరై, సిబ్బంది కుటుంబాలతో మమేకమయ్యారు. ఎన్నో ఒత్తిడులతో విధులు నిర్వహించే రెవెన్యూ ఉద్యోగులు ఇలా కుటుంబాలతో కలిసి ఆనందంగా గడపడం ఆనందకరమని తెలిపారు. అలాగే వివిధ సందర్భాల్లో మరణించిన ఉద్యోగులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీఎం భాస్కర్ రైతా, డిప్యూటీ కలెక్టర్లు మౌసమీ నాయక్, శుభ్రత్ బెహరా, జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తిరుపతి బాలాజీ బెహరా తదితరులు పాల్గొన్నారు.

చైతన్య సమితి సభ్యుల విహారయాత్ర



విహారయాత్రలో పాల్గొన్న చైతన్య ఆంధ్రసాహితీ సంస్కృతి సమితి సభ్యులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న పోలిశెట్టి, కృష్ణమూర్తి, జనార్దనరావు

పర్లాకిమిడి: పట్టణానికి చెందిన చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి సభ్యులు ఆంధ్రప్రదేశ్‌లోని సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో ఆదివారం సందడి చేశారు. ఈ విహార యాత్రలో భాగంగా చైతన్య సమితి అధ్యక్షుడు బర్నాల జనార్దనరావు, న్యాయ సలహాదారు వీఎస్ఎన్ రాజు, కార్యదర్శి పి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్, ప్లాస్టిక్ బాల్ త్రోయింగ్ తోపాటు మగవారికి పాటల పోటీలు నిర్వహించగా, అంతా సందడిగా గడిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు పోలిశెట్టి, పైడిశెట్టి సుధా, ఈసై వెంకట్రావు, గంటా నానాజీ, బర్నాల గౌరీదేవి, ముండూరు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక హక్కులపై చైతన్య శిబిరం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, న్యాయాధికారులు

జయపురం: భారత రాజ్యాంగం ప్రజల కోసం మౌలిక హక్కులు, బాధ్యతలు, స్వతంత్రత, భద్రత, చట్టపరమైన సమానత్వం, సామాజిక సురక్ష, స్వశక్తీకరణ, విద్య, వైద్యం సౌకర్యాలను కల్పించిందని కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రధీకరణ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన సత్యనారాయణ మిశ్రా వివరించారు. జయపురం సమితి అంత గ్రామ పంచాయతీ పూజారిపుట్, బయాగుడ గ్రామాల్లో శని, ఆదివారాల్లో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ, చట్టపరమైన పలు అధికారాలపై ప్రజలకు చైతన్య పరచారు. కార్యక్రమంలో న్యాయసేవా ప్రధీకరణ కార్యదర్శి సుమన్ జెనా, కార్మికశాఖ అదనపు అధికారి చైతన్యప్రసాద్ మాఝి, జిల్లా శిశు సురక్షా అధికారి రాజశ్రీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



ప్రమాదానికి కారణమైన ప్రైవేటు బస్సు



బస్సు కింద నలిగిపోయిన బైక్

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- చందిలిలో బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురైన ముగ్గురు స్నేహితులు

మల్కన్‌గిరి: రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే... మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల నుంచి ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు భువనేశ్వర్‌కు బయలుదేరింది. అయితే ఎంవీ–19 గ్రామం వద్ద బైక్‌పై వెళ్తున్న చైతన్య మాఝి(33)ని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో చైతన్య బస్సు చక్రం కిందకు కూరుకుపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు రక్షించే ప్రయత్నం చేసేప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మల్కన్‌గిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్, సిబ్బంది పరారవ్వడంతో బస్సును సీజ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో..

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు రివల్‌కోన గ్రామానికి చెందిన రోహిత్ హిమిరిక(28) కాగా, అదే గ్రామానికి చెందిన సునీల్ హిమిరిక(25), అనాసి హుయిక(26) గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న చందిలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రాయగడ ప్రభుత్వ ఆస్పత్రికి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. బాధితులు ముగ్గురు స్నేహితులు కాగా.. బైక్‌పై సమీపంలోని రామ్‌పూర్‌కు వెళ్లి వస్తుండగా రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కొణార్క్‌లో రోడ్డు ప్రమాదం..



రాయగడ: ఘటన స్థలం వద్ద రోహిత్ మృతదేహం



భువనేశ్వర్: ఘటనా స్థలంలో నుజ్జయిన ఆటో

భువనేశ్వర్: ప్రముఖ పర్యాటక కేంద్రం కొణార్క్‌లో ఎదురెదురుగా వస్తున్న ఆటో, బొలేరో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. మెరైన్ డ్రైవ్ మార్గంలోని చంద్రభాగ లైట్‌హౌస్ వద్ద దట్టమైన మంచు కమ్ముకోవడంతో రోడ్డు కనిపించక ఎదురుగా వస్తున్న ఆటోను బొలేరో బలంగా ఢీకొంది. ప్రమాదంలో ఆటో ముందుభాగం నుజ్జవ్వగా, తీవ్ర గాయాలపాలైన డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష



ఎచ్చెర్ల వెంకటేశ్వర పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతం జరిగాయని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఏపీపీఎస్సీ సెక్రటరీ హెచ్.అరుణ్ కుమార్ ఉదయం శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆకస్మికంగా తనిఖీ చేసి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో 19 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో జరిగిన పరీక్షలు జరిగాయన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 72.59 శాతం మంది హాజరు కాగా 1535 మంది హాజరు కాలేదని పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 72.32 శాతం మంది హాజరు కాగా 1550 మంది హాజరు కాలేదని తెలిపారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్, శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్ పరీక్ష కేంద్రాల్లో ఆదివారం గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష సజావుగా జరిగింది. రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల ఏర్పాట్లు, నిర్వహణను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక పరిశీలించారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రాల తనిఖీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన గ్రూప్-1 పరీక్ష కేంద్రాలను ఎస్పీ జీఆర్ రాధిక తనిఖీ చేశారు. ఉమెన్స్ కాలేజీ, శ్రీ వెంకటేశ్వర కళాశాలతో పాటు పలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా సమర్థంగా పరీక్షలు నిర్వహించాలని, ఉదయం, మధ్యాహ్నం పరీక్షలయ్యాక పరీక్ష కేంద్రానికి వంద మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నందున అభ్యర్థులు తప్ప మిగిలినవారెవరూ వీటి ఆవరణలో ఉండకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎస్పీతో పాటు సబ్ డివిజనల్ అధికారి మహేంద్ర మతే ఉన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు



ట్రైబల్ యూనివర్సిటీ వీసీకి జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదిత్యుడు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చాడు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తగిన ఏర్పాట్లు చేశారు. విజయనగరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కత్తిమణి స్వామిని దర్శించుకున్నారు. ఏపీ ఎమ్మెల్సీ అనంతబాబు కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకున్నారు. అనంతరం సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. అలాగే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సి) బాలానాయక్, స్థానిక జిల్లా ఎస్ఈబీ ఎస్పీ మణికంఠ తదితరులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యువాత



నువ్వలరేవు తీరానికి చేరిన తాబేళ్ల కళేబరాలు

వజ్రపుకొత్తూరు రూరల్: సముద్ర జీవుల్లో అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. సంతానోత్పత్తి కోసం గుడ్లు పెట్టేందుకు వేల మైళ్ల దూరం నుంచి ఇక్కడి తీరానికి ఇవి వస్తుంటాయి. ఈ తరుణంలో మత్స్యకారులు వినియోగిస్తున్న నిషేధ వలల తాకిడికి అలాగే ఇంజిన్ల తగిలి ఇవి చనిపోతున్నాయి. ఇలా మృత్యువాత పడిన తాబేళ్లు తీరానికి కొట్టుకు వస్తున్నాయి. విశాల సముద్ర తీరం కలిగిన శ్రీకాకుళం జిల్లాలో అక్కుపల్లి, నువ్వలరేవు, మంచినీళ్లపేట, చిన కొత్తూరు, కంబలరాయుడు పేట, రట్టి, భావనపాడు, గుణుపల్లి తదితర తీరాల్లో పదుల సంఖ్యలో తాబేళ్ల కళేబరాలు కనిపిస్తున్నాయి. వీటి నుంచి దుర్వాసన రావడంతో మత్స్యకారులు తీరంలో గల ఇసుక తిన్నెలలో కప్పి పూడుస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: మండల కేంద్రం టెక్కలిలోని నెల్లూరు వీధికి చెందిన డి.స్వాతి అనే వివాహిత ఆదివారం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. కుటుంబ తగాదా కారణంగా మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న ఆలౌట్ దోమల మందును తాగింది. అనంతరం నేరుగా టెక్కలి పోలీసుస్టేషన్‌కు వెళ్లడంతో ఎస్ఐ రామకృష్ణ వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. బాధితురాలి నుంచి పూర్తి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

నాణ్యమైన సేవలకు కేరాఫ్.. ఎయిమ్స్

- కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ
- భువనేశ్వర్ ఎయిమ్స్‌లో ఘనంగా 4వ స్నాతకోత్సవ వేడుకలు



ప్రసంగిస్తున్న కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మాన్సుఖ్ మాండవీయ



ఉత్తీర్ణులకు ధ్రువపత్రం అందజేస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

భువనేశ్వర్: తూర్పు తీరంలో నాణ్యమైన వైద్య సేవలకు కేరాఫ్‌గా భువనేశ్వర్ ఎయిమ్స్ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుందని కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. రాష్ట్రంతో పాటు ఇరుగు-పొరుగు రాష్ట్రాల ప్రజల ఆరోగ్య సంరక్షణలో విశ్వాసాన్ని చూరగొనడం విశేషమని ప్రశంసించారు. నగరంలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)లో శనివారం సాయంత్రం జరిగిన 4వ స్నాతకోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ హాజరయ్యారు. ఇందులో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 40మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. నలుగురు డీఎం/ఎంసీహెచ్ స్కాలర్లు, 10మంది ఎండీ/ఎంఎస్, 17మంది ఎంబీబీఎస్, ఆరుగురు బీఎస్సీ నర్సింగ్, ముగ్గురు బీఎస్సీ పారామెడికల్ అభ్యర్థులు మంత్రుల చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నారు.

స్థానిక భాషల్లో మెడిసిన్..

ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాండవీయ మాట్లాడుతూ.. బోధన, పరిశోధన, ఆరోగ్య సంరక్షణ ఇతరేతర అనుబంధ రంగాల్లో భువనేశ్వర్ ఎయిమ్స్ సత్ఫలితాలు సాధిస్తుందని తెలిపారు. 'హీల్ ఇన్ ఇండియా' 'హీల్ బై ఇండియా' వంటి సరికొత్త కార్యక్రమాలు దేశంలో వైద్య విలువల పరిరక్షణకు పట్టం గడతాయన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద 50కోట్ల కుటుంబాలు లబ్ధి పొందాయని వెల్లడించారు. దేశవ్యాప్తంగా 9వేలు పైబడిన జన్ ఔషధి కేంద్రాలు సరసమైన ధరలకే నాణ్యమైన మందులు అందిస్తున్నాయన్నారు. కోవిడ్ మహమ్మారి నిర్వహణలో భారత్ అంతర్జాతీయ గుర్తింపు పొందిందని, 140 దేశాలకు మేడ్ ఇన్ ఇండియా వ్యాక్సిన్ లను సరఫరా చేసిందని గుర్తుచేశారు. విద్యార్థులకు అవగాహనను పెంపొందించేందుకు వైద్య పుస్తకాలను స్థానిక భాషల్లో అందించడానికి కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు.

జాతీయ స్థాయిలో రెండో స్థానం..

జాతీయ స్థాయిలో ఎయిమ్స్ సంఖ్య నిరవధికంగా పెరుగుతోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. 2014లో 8కి పరిమితమైన ఎయిమ్స్ సంస్థలు ప్రస్తుతం 23కి పెరిగినట్లు గుర్తుచేశారు. భువనేశ్వర్ ఎయిమ్స్ జాతీయ స్థాయిలో ద్వితీయ ఉత్తమ ఎయిమ్స్‌గా, 26వ అత్యుత్తమ వైద్య సంస్థగా గుర్తింపు సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా క్యాంపస్ సముదాయంలో అత్యాధునిక బర్న్స్ సెంటర్‌ను ప్రజాసేవకు అంకితం చేశారు. క్రిటికల్ కేర్ హాస్పిటల్ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్యశాఖ అదనపు కార్యదర్శి మనోహర్ అగ్నాని, ఎయిమ్స్ భువనేశ్వర్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశుతోష్ బిశ్వాస్, అధ్యక్షుడు ప్రొఫెసర్ సుబ్రతకుమార్ ఆచార్య, డీన్ ప్రొఫెసర్ ప్రశాంత రంజన్ మోహపాత్ర పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- బీజేడీ శ్రేణులకు మాజీ ఎంపీ ప్రదీప్‌మాఝి పిలుపు
- కొరాపుట్‌లో ప్రసంగించిన కేసీసీబీ అధ్యక్షుడు ఈశ్వర్ పాణిగ్రాహి



కొరాపుట్: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ప్రభుజానీ



కొట్‌పాడ్ బీజేడీ సభలో ప్రసంగిస్తున్న ప్రదీప్ మాఝి



వేదికపై ఎమ్మెల్యేలు, బీజేడీ నాయకులు

జయపురం: 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని నవరంగపూర్ మాజీ ఎంపీ ప్రదీప్‌మాఝి పిలుపునిచ్చారు. సబ్ డివిజన్ పరిధి కొట్‌పాడ్ సంత తోటలో బీజేడీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 22 ఏళ్లుగా రాష్ట్రంలో సుస్థిర పాలన అందిస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి పనులు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దేశంలోనే అత్యుత్తమ సీఎం అని ప్రశంసించారు. మాజీ ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ ఆశయాలతో రాష్ట్రంలో ప్రజలకు కన్న బిడ్డలా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. బీజేడీ అమలు చేస్తున్న ప్రజాహిత పథకాలను క్షేత్రస్థాయి నుంచే ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మినీ దియాన్, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర మాఝి, బొరిగుమ్మ సమితి అధ్యక్షుడు ప్రత్యమయి నాయక్, జిల్లా పరిషత్ సభ్యుడు ప్రశాద్ బిడ్డిక, బీజేడీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ బిశాయి, జిల్లా బీజేడీ అధ్యక్షుడు ఈశ్వర పాణిగ్రాహి, నవరంగపూర్ జిల్లా డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రొంధారి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పొడాల్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సుస్మిత మెలక, ఉపాధ్యక్షుడు రాధాబినోద్ సామంతరాయ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆశాజ్యోతి.. సీఎం నవీన్

కొరాపుట్: దండకారణ్య గిరిజన ఆశాజ్యోతి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అని కొరాపుట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు, జిల్లా బీజేడీ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి అన్నారు. జిల్లాలోని లక్ష్మీపూర్ కళాశాల మైదానంలో జరిగిన విధానసభ స్థాయి బీజేడీ వ్యవస్థాపక సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 3 దశాబ్దాలు క్రితం ఈ ప్రాంతంలో గిరిజనులకు సరైన ఆహారం కూడా దొరక్క ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం జిల్లాలో ప్రతి గిరిజనుడు కడుపునిండా తిండితో పాటు పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారని తెలిపారు. మైదాన ప్రాంతాలతో ప్రస్తుతం లక్ష్మీపూర్ ప్రాంతం పోటీ పడుతుందన్నారు. గిరిజన కుటుంబంలో పుట్టిన ప్రతి ఆడబిడ్డా చదువుకొని, ఉద్యోగాలు సాధించాలనే సీఎం నవీన్ ఆశయమని వివరించారు. కార్యక్రమంలో లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీ, పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పొడాల్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకా, మాజీ ఎంపీ జిన్ను హికాక, మాజీ ఎమ్మెల్యే కైలాష్ కులసిక, కొరాపుట్ మున్సిపల్ ఛైర్మన్ లలాటేందు రంజన్‌రౌత్, సమితి ఛైర్మన్లు, జెడ్పీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పథకాల అమలును ప్రజలే పరిశీలించాలి



మాట్లాడుతున్న జిల్లా శిశు సంరక్షణాధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి

- ఏడీఎం సంగ్రాంశేఖర పండా

పర్లాకిమిడి: ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో అధికారులకు తెలియజేయాలని జిల్లా అదనపు మేజిస్ట్రేటు సంగ్రాంశేఖర పండా కోరారు. గుమ్మా బ్లాక్ తరంగడ పంచాయతీలో శనివారం జరిగిన జిల్లా న్యాయసలహా ప్రాధికరణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాధికరణ కార్యదర్శి రబినారాయణ బెహరా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శిశువికాస్, ప్రాజెక్టుల అధికారి అనితా రాణి పట్నాయక్ మాట్లాడారు. బాలికల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని స్వయం సహాయక సంఘాల మహిళలకు సూచించారు. జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టాలని, జిల్లా కోర్టులో అందిస్తున్న ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమాజిక భదతాధికారి సంతోష్‌కుమార్ నాయక్, జిల్లా శిశుసు రక్షా అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగిని మృతితో ఉద్రిక్తత



రస్తారోకో చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాబుగాం ఎమ్మెల్యే రంధారీ

కొరాపుట్:

విధులలో ఉన్న తాత్కాలిక ఉద్యోగిని మృతి చెందడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నవరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక ఉద్యోగిని సునీతా కులదీప్(45) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. అటెండెంట్‌గా పని చేస్తున్న ఆమె.. ఆకస్మికంగా విధుల్లోనే కుప్పకూలి పోయారు. వెంటనే వైద్యులు చికిత్స అందజేసినప్పటికీ ఫలితం లేకపోయింది. తాత్కాలిక ఉద్యోగి కావడంతో ఆమెకు గత 6 నెలలుగా జీతాలు అందడం లేదు. ఈ సమస్యపై ఉద్యోగుల్లో అసంతృప్తి ఉంది. ఈ ఘటన జరగడంతో అంతా ఆగ్రహానికి గురై, ఆందోళనకు దిగారు. జీతం లేకపోవడంతో మానసిక ఒత్తిడి గురై, మరణించారని నినాదాలు చేశారు. ఆందోళన ఉద్రిక్తం కావడంతో డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారీ ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరుపున అన్ని సహాయ సహకారాలు అంజేస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ వెనక్కి తగ్గక పోవడంతో బీజేపీ నాయకుడు గౌరీశంకర్ మాఝి, డీసీసీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠీ, మాఘరా ప్రతినిధి కాదంబనీ త్రిపాఠీ ఆస్పత్రి చేరుకొని ఆందోళనకారులకు మద్దతు తెలిపారు. అనంతరం నందాహండి-నవరంగ్‌పూర్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని, బాధిత కుటుంబానికి సాయం చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద రూ.20 వేలను రెడ్‌క్రాస్ నిధుల నుంచి అందజేశారు. దీంతో ఆందోళన విరమించారు.

శ్రీకృష్ణునికి పొన్నాకు హారతులు



స్వామివారికి హారుతులిస్తున్న వేద పండితులు కృష్ణమాచార్యులు

పర్లాకిమిడి:

ధనుర్మాసం సందర్భంగా వేంకటేశ్వర ఆలయంలో శ్రీకృష్ణునికి పొన్న ఆకులో ప్రత్యేక హారతులిచ్చారు. వేద పండితులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గత 14 రోజులుగా ఉదయం నక్షత్ర హారతులు నిర్వహిస్తున్నారు. ఆదివారం పొన్నాకు హారతులివగా, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

30 మంది యువకుల రక్తదానం



21 సార్లు రక్తదానం చేసిన సాగర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

కాశీబుగ్గ: పలాస మండలం సున్నాదేవి గ్రామం జాతీయ రహదారి పక్కన ఆదివారం గ్రామస్తులు రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావు హాజరై ప్రారంభించారు. ఇందులో సుమారు 30 మంది యువకులు రక్తదానం చేశారు. అలాగే 21 సార్లు రక్తదానం చేసిన మాకన్నపల్లి గ్రామానికి చెందిన యువకుడు రాపాక సాగర్‌ను సత్కరించారు.

మట్టికోనలో వాలీబాల్ టోర్నీ ప్రారంభం



ట్రోఫీని అందుకుంటున్న జేకే పేపర్‌మిల్ జట్టు



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నెక్కంటి

రాయగడ: జిల్లాలోని మట్టికోన గ్రామంలో బిజూ పట్నాయక్ సంస్మరణ వాలీబాల్ టోర్నమెంట్‌ను రాజ్యసభ మాజీ ఎంపి నెక్కంటి భాస్కరరావు శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేడీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ టోర్నామెంట్‌ను పార్టీ శ్రేణులు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో గ్రామీణ క్రీడాకారులు తమ ప్రతిభను కనబరచేందుకు ఇదే మంచి అవకాశమని తెలిపారు. క్రీడల్లో ఉజ్వల భవిష్యత్ ఆశించే వారికి ఇదే సదావకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీమంత్రి, బీజేడీ సీనియర్ నాయకుడు లాల్‌బిహారి హిమిరిక, సమితి వైస్‌ఛైర్మన్ హరిప్రసాద్ హెప్రుక, జిల్లా పరిషత్ సభ్యులు ప్రశాంత్ కులిసిక తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జేకే క్రికెట్ టోర్నీ

రాయగడ: జిల్లా కేంద్రానికి సమీపంలోని జేకే పేపర్‌మిల్ మైదానంలో ఈనెల 4 నుంచి కొనసాగుతున్న జేకే పేపర్‌మిల్ ఇంటర్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం సాయంత్రం ముగిసింది. ఇందులో జేకే పేపర్‌మిల్స్, సెంట్రల్ పల్ప్‌మిల్(సొనాగడ) జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన జేకే జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 137 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పల్ప్‌మిల్ జట్టు 16.4 ఓవర్లలో కేవలం 84 పరుగులకే ఆలౌట్ అయ్యారు. విజేతలకు జేకే పేపర్‌మిల్ మహిళా మండలి అధ్యక్షురాలు శ్వేత ద్వివేది ట్రోఫీ అందించారు. ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా అరుణ్ సాబోరో, ఉత్తమ బౌలర్‌గా కె.శంకర్‌పాత్రొ, ఆల్ రౌండర్‌గా సెంట్రల్ పల్ప్‌మిల్స్ జట్టుకు చెందిన నితేష్ గుణశ్రేష్ఠ నిలిచారు.

కన్నులపండుగ



స్థానిక దేశవానిపేటలోని బీసీ బాలికల వసతి గృహంలో ఆదివారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. భోగి మంటలు, హరిదాసు వేషధారణలతో అలరించారు. – నరసన్నపేట

క్లుప్తంగా

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

రాజాం సిటీ: మండల పరిధి మారెడుబాక గ్రామసమీపంలోని మామిడితోటలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేశామని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి పట్టుకుని వారి నుంచి రూ.48,280 స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదుచేశామని చెప్పారు. గ్రామాల్లో పేకాట శిబిరాలు నిర్వహించవద్దని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళా దొంగ..

విజయనగరం క్రైమ్: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగ్‌ను చోరీ చేసిన మహిళా దొంగను వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ జి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. పద్మనాభం మండలానికి చెందిన కె.సన్యాసమ్మ బట్టల వ్యాపారం నిమిత్తం విజయనగరం బాలాజీ మార్కెట్‌కు వచ్చింది. రైల్వేస్టేషన్‌రోడ్డులో దిగిన తరువాత తన బ్యాగ్‌లో ఉన్న రూ.50వేల నగదు మాయమైనట్లు గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు కన్యకాపరమేశ్వరి కోవెల వద్ద సీసీ కెమెరాల ఆధారంగా నిందితురాలిని గుర్తించారు. ఆమెను ఎల్.కోట మండలం రంగాపురానికి చెందిన దాసు యేసుమణిగా తెలుసుకుని అదుపులోకి విచారణ చేసి ఆమె నుంచి రూ.48 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన అప్పారావు

జామి: మండలంలోని అలమండ గ్రామానికి చెందిన మాకిరెడ్డి అప్పారావు (46) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీలో మెకానిక్‌గా పనిచేసే అప్పారావు మద్యానికి బానిసై విధులకు కొంతకాలంగా వెళ్లక పోవడంతో ఆర్థికంగా చితికిపోయాడు. దీంతో మనస్తాపం చెంది శనివారం తన ఇంటి మేడమీద పురుగు మందు తాగేశాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కోనాడ తీరంలో మృతదేహం లభ్యం

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ సముద్రతీరంలో ఆదివారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. చీపురుపల్లి మండలం కొత్తఅగ్రహారానికి చెందిన కాసా శ్రీనివాసరావు (20) ఈనెల 4 వతేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి బంధువులు అచూకీ కోసం వెతుకుతుండగా ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో కోనాడ సముద్రతీరంలో విగతజీవిగా ఒడ్డుకు కొట్టుకొచ్చాడు. మృతుడు శ్రీనివాసరావుకు ఉద్యోగం లేకపోవడంతో కొంతకాలంగా బాధపడుతున్నట్లు బంధువులు తెలిపారు.. తల్లిదండ్రులను పోషించాల్సిన సమయంలో వారికి భారమయ్యానని మనస్తాపం చెంది సముద్రంలో దూకి ఉండవచ్చని చెప్పారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి సుందరపేట ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఎ.నరేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీకనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ఆలయ పూజారులు ఆదివారం పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు

శృంగవరపుకోట: సంక్రాంతి పండగ సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ చార్జీలతో ప్రత్యేక అల్ట్రా డీలక్స్ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్.కోట నుంచి విశాఖ మీదుగా హైదరాబాద్‌కు ఈ నెల 10, 11, 12 తేదీల్లోనూ అల్ట్రా డీలక్స్ సర్వీసులు సాధారణ చార్జీలకు నడుపుతామని, విశాఖపట్నం నుంచి ఎస్.కోట, అరుకు వైపు వెళ్లే ప్రయాణికుల కోసం స్పెషల్ సర్వీసులు నడుపుతున్నట్లు స్పష్టం చేశారు. పండగ తర్వాత 16, 17తేదీల్లో తిరుగు ప్రయాణం కోసం ఎస్.కోట నుంచి హైదరాబాద్‌కు సర్వీసులు నడుపుతామని, డిమాండ్‌ను బట్టి సర్వీసులు పొడిగిస్తామని ఆయన పేర్కొన్నారు. పండగ సీజన్‌లో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు రానుపోనూ ప్రయాణానికి ఒకేసారి ఆన్‌లైన్‌లో టికెట్ రిజర్వ్ చేసుకుంటే 10శాతం రాయితీ ఇస్తామని వెల్లడించారు. సీనియర్ సిటిజన్లకు అయితే 25శాతం రాయితీ అందిస్తామని వివరించారు. ప్రయాణికులు ఈ సర్వీసులను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వెదురుతో ఆదరువు

- చేతిపనికి సాంకేతికత జోడింపు
- రాజాం జీఎంఆర్ఐటీ ఆధ్వర్యంలో శిక్షణ
- ఏడాది కాలంగా తర్ఫీదు
- వెదురుకర్రలతో బుట్టలు, పెన్‌స్టాండ్స్, ఫ్లవర్ బొకేల తయారీ



సీడ్ ప్రాజెక్ట్ ద్వారా జరుగుతున్న శిక్షణ కార్యక్రమం



అందమైన బొకేలు



పూల కూజాలు



వెదురుతో తయారు చేసిన వస్తువులు



ఆకర్షణీయమైన వస్తు సామగ్రి



టేబుల్ డెకరేషన్ వస్తువు

రాజాం: వెదురుకర్రతో తయారు చేసిన బుట్టలు అందరికీ తెలిసినవే. వెదురు కర్ర తట్టల గురించి చెప్పనక్కర్లేదు. సాధారణంగా ఇవన్నీ ఎప్పటినుంచే గ్రామీణ ప్రాంతాల్లో చూస్తున్న వస్తుసామాగ్రే. అయితే వాటికి భిన్నంగా ఇదే ముడిసరుకుతో మరెన్నో వస్తువులు కూడా తయారుచేసి ఇంట్లో అందంగా అలంకరించుకోవచ్చు. స్నేహితులకు బహుమతిగా ఇవ్వొచ్చు. కాస్తా సాంకేతికత తోడైతే చాలు ఇదే వెదురుకర్ర ఎన్నో అద్భుతాలు సృష్టిస్తుందని రాజాం పట్టణానికి చెందిన జీఎంఆర్ఐటీ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నిరూపిస్తోంది. గత ఏడాది కాలంగా రాజాం చుట్టపక్కల గ్రామాలకు చెందిన వెదురుపనివారికి వెదురుతో తయారు చేసే అందమైన వస్తుసామగ్రిపై శిక్షణ ఇస్తున్నారు.

ప్లాస్టిక్ నిషేధమే లక్ష్యంగా..

న్యూఢిల్లీకి చెందిన సైన్స్ ఫర్ ఈక్యూటీ ఎంపవర్ అండ్ డెవలప్‌మెంట్ డివిజన్ (సీడ్) ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు ప్రారంభించింది. ప్రజలు వినియోగించే నిత్యావసర వస్తుసామగ్రిలో కొన్నింటిని ప్లాస్టిక్ నుంచి దూరంచేసేందుకు చేతితో తయారీచేసే వస్తుసామగ్రిపై దృష్టిసారించింది. ఓ వైపు ప్లాస్టిక్‌ను నివారించేందుకు వెదురుపుల్లలతో తయారుచేసే వస్తుసామగ్రిని ప్రోత్సహించడం, మరో వైపు వాటిని తయారీచేసే కులవృత్తుల చేతిపనివారికి సాంకేతికత అందించి వారి జీవన నైపుణ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా చేసుకుంది. దేశంలోని పలు ఐటీ కళాశాలల్లో చేతి వృత్తుల వారికి సాంకేతిక నైపుణ్యాలు అందించే కార్యక్రమాలు చేపట్టగా రాజాంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏడాది క్రితం ఒక ప్రాజెక్ట్ ప్రారంభించింది. వెదురుకర్రలు, పుల్లలతో తయారయ్యే వస్తుసామగ్రిని మరింత అందంగా తయారీచేసే విధానాన్ని చేతిపనివారికి నేర్పుతోంది.

శిక్షణకు విశేష ఆదరణ

జీఎంఆర్ఐటీ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జరుగుతున్న సాంకేతిక శిక్షణకు విశేష ఆదరణ కనిపిస్తోంది. ప్రస్తుతం రాజాం, సంతకవిటి, రేగిడి, జి.సిగడాం తదితర మండలాలకు చెందిన వెదురు పనివారు ఈ శిక్షణ వినియోగించుకుంటున్నారు. ఇప్పటివరకూ 150 మంది శిక్షణ పొందారు. ఒక వ్యక్తికి 25 రోజులు శిక్షణ ఇస్తుండగా, శిక్షణ సమయంలో రోజుకు రూ. 200లు స్టైపెండ్ ఇస్తున్నారు. శిక్షణ బాగా సద్వినియోగం చేసుకున్నవారు సొంతంగా మెషీన్లు కొనుగోలుచేసేవిధంగా బ్యాంకు రుణాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈశిక్షణను పూర్తిగా వెదురుపని తెలిసిన శిక్షకుల ద్వారా ఇప్పించడంతో పాటు శిక్షణలో మెలకువలు నేర్చుకుని, బాగా వస్తుసామగ్రి తయారు చేస్తున్నవారితో కూడా కొత్తవారికి శిక్షణ ఇప్పిస్తున్నారు. సీడ్ ప్రాజెక్ట్‌లో బాగంగా తయారీచేస్తున్న వెదురు వస్తుసామగ్రి చాలా అందంగా, అపురూపంగా దర్శనమిస్తోంది. టీ, కాఫీ కప్పులు, ట్రేలు, సజ్జలు, ఫ్లవర్ బొకేలు, కూజాలు, దుస్తులు పెట్టే తొట్టెలు, చిన్నారుల ఊయల తొట్టెలు, పెన్నుల స్టాండ్‌లు, బట్టల స్టాండ్‌లు ఇలా వినూత్న వస్తుసామాగ్రి రూపొందుతోంది. ఇవన్నీ ప్లాస్టిక్ రహిత వస్తుసామగ్రి కావడంతో పాటు పర్యావరణ హితమైనవి. ఎటువంటి విద్యార్హత లేకున్నా వెదురుపనితెలిసి, 18 నుంచి 45 సంవత్సరాలలోపు ఉన్నవారు ఇక్కడికి శిక్షణకు వచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రాజెక్ట్ వివరాలిలా..

ప్రాజెక్ట్ పేరు	: సీడ్(సైన్స్ ఫర్ ఈక్యుటీ ఎంపవర్ అండ్ డెవలప్‌మెంట్ డివిజన్)
పర్యవేక్షణ	: జీఎంఆర్ఐటీ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం
కేటాయించిన నిధులు	: 1.59 కోట్లు
శిక్షణ పొందేవారు	: వెదురుపనివారు
లబ్ధిపొందే వారు	: ఎస్సీఎస్టీ కులాలకు చెందిన 800 కుటుంబాలు
ఒక వ్యక్తికి శిక్షణకాలం	: 25 రోజులు
ఉపయోగించే ముడిసరుకు	: వెదురుకర్రలు
తయారీచేసేవి	: పెన్‌స్టాండ్‌లు, ఫ్లవర్‌బొకేలు, కూజాలు, తొట్టెలు
ఉపయోగించే యంత్రాలు	: 23
ప్రాజెక్ట్ కాలం	: 3 సంవత్సరాలు

చాలా మంచి ప్రాజెక్ట్



చేతివృత్తి చేసుకునే వారిలో నైపుణ్యం మెరుగు పరిచేందుకు, వారికి సాంకేతికత అందించేందుకు సీడ్ సాయంతో వెదురుపని చేసే చేతివృత్తుల వారికి శిక్షణ శిబిరం ఏర్పాటుచేశాం. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లోని వెదురు పనివారికి అవకాశం కల్పిస్తున్నాం. ఇప్పటివరకూ 150 మంది శిక్షణ పొందారు.

– డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్విస్టిగేటర్, జీఎంఆర్ఐటీ, రాజాం.

విడతల వారీగా..



జీఎంఆర్ఐటీ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాల్లో భాగంగా చేతివృత్తుల వారికి సాంకేతికతను అందిస్తున్నాం. ఓ వైపు చేతివృత్తుల వారికి మెలకువలు నేర్పడంతో పాటు మరో వైపు ప్లాస్టిక్ వస్తుసామగ్రి వినియోగం తగ్గించడం లక్ష్యంగా ఈకార్యక్రమం జరుగుతోంది. ఒక బ్యాచ్‌కి 20 మంది వరకూ శిక్షణ ఇస్తున్నాం. విడతల వారీగా, వెదురుపనివారికి ఖాళీగా ఉన్న సమయంలో ఈ శిక్షణ ఇస్తున్నాం.

– డాక్టర్ పీఎస్ఎల్ పావని, కో ప్రిన్సిపాల్ ఇన్విస్టిగేటర్, జీఎంఆర్ఐటీ

2 లక్షల టన్నుల చెరకు క్రషింగ్



కర్మాగారం యార్డులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చెరకు

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో 2 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయిందని కర్మాగారం అసోసియేట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎ.నాగేశ్వారెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అన్ని ప్రాంతాల నుంచి చెరకును కర్మాగారానికి తీసుకొస్తున్నారన్నారు. చెరకును నరికేందుకు రైతులకు ఎటువంటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెరకును వాహనాల ద్వారా కర్మాగారానికి తరలించేటప్పుడు ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చెరకును తరలిస్తున్నామని చెప్పారు. రోజుకు 4,500 టన్నులు క్రషింగ్ చేస్తున్నామని వెల్లడించారు.

• వేణుగోపాలుడికి నవనీత సేవ





పట్టణంలోని ప్రముఖ దేవాలయం వేణుగోపాల స్వామికి నవనీత సేవ, పుష్పయాగాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన రకరకాల పూలతో ఆలయాన్ని అందంగా అలంకరించారు. నవనీత సేవను గతంలో ఎన్నడూ జరగని రీతిలో నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. –బొబ్బిలి



విజయనగరంలో కురుస్తున్న మంచు

గజగజ

శీతాకాలం తడాఖా చూపిస్తోంది. మూడు రోజులుగా జిల్లా ప్రజలు చలితో వణికిపోతున్నారు. ఇప్పటి వరకు అంతగా ప్రభావం చూపని చలి ఇప్పుడు పంజా విసురుతోంది.



జనవరి 4 నుంచి నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతల వివరాలు డిగ్రీలలో

తేదీ	కనిష్టం	గరిష్టం
04	18	28
05	17	27
06	15	28
07	15	27
08	14	26

- వణికిస్తోన్న చలి పులి
- మూడు రోజులుగా పెరిగిన చలి తీవ్రత
- ఉదయం 8 గంటల వరకు కురుస్తున్న పొగమంచు
- అపరాల పంటలపై తీవ్ర ప్రభావం

విజయనగరం ఫోర్ట్:

చలి పులి గజగజలాడిస్తోంది. మూడు రోజులుగా చలి తీవ్రత పెరిగి పంజా విసురుతోంది. ఓ వైపు పొగమంచు.. మరోవైపు చల్లని గాలులు ప్రజలను గజగజలాడిస్తున్నాయి. రాత్రి పూట ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా తగ్గాయి. పగటి పూట కూడా చలి గాలులు వీస్తుండడంతో వణికిపోతున్నారు. చలి తీవ్రతతో ఫుట్‌పాత్, పూరి గుడిసెల్లో నివసించేవారు... ఏజెన్సీ వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. మైదాన ప్రాంతాల కంటే గిరిజన ప్రాంతాల్లో చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. మైదాన ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 14 నుంచి 20 డిగ్రీలు ఉంటే గిరిజన ప్రాంతాల్లో ఎనిమిది నుంచి 10 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పొగ మంచు ప్రభావంతో అపరాల పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు చలి బారి నుంచి రక్షించుకునేందుకు ఉదయం 9గంటల వరకు చలి మంటలు ప్రజలు కాగుతున్నారు.

మంచు దుప్పటి..

కొద్ది రోజులుగా ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు కురుస్తోంది. పంట పొలాలు, గ్రామాలు, రహదారులు, చెరువులు కనిపించనంతగా మంచు కప్పేస్తోంది. దీని ప్రభావంతో ప్రజలు జ్వరం, జలుబు, దగ్గు వంటి వాటి బారిన పడుతున్నారు. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా వీటి బారిన పడుతున్న వారి సంఖ్య ప్రతి ఇంటా కనిపిస్తున్నారు.

అపరాలపై తీవ్ర ప్రభావం

పొగమంచు దట్టంగా కురువడం వల్ల అపరాలైన పెసర, మినుము పంటలపై ప్రభావం చూపుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మంచు అధికంగా కురవడం వల్ల పూత మాడిపోయే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. దీని ప్రభావంతో పంట దిగుబడులు కూడా తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. రైతులు కూడా ఇదే విధంగా పొగ మంచు కురిస్తే పంటల దిగుబడి గణనీయంగా తగ్గుతాయని ఆందోళన చెందుతున్నారు.



గంట్యాడ మండలం పెదవేమలిలో చలి మంట

కరోనా వేళ తస్మాత్...

కరోనా ఫోర్త్ వేవ్ మొదలైన నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ సమయంలో చలిలో అతిగా తిరగడం అంత మంచిది కాదని చెబుతున్నారు. జలుబు, దగ్గు బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి.

జాగ్రత్తలు పాటించాలి



చలికాలంలో ఆస్తామా, అలర్జీ ఉన్న వారికి వ్యాధి తీవ్రత ఎక్కువ అవుతుంది. పిల్లల్లో ఉష్ణోగ్రత తగ్గుతుంది. అలర్జీ, ఆస్తామా ఉన్న వారు, పిల్లలు చలిలో తిరగరాదు. కోవిడ్ వ్యాప్తి చెందుతున్న ప్రస్తుత తరుణంలో అప్రమత్తంగా ఉండాలి. అత్యవసరంగా వెళ్లాలనుకుంటే మంకీ కేప్, స్వెటర్‌లు వంటివి ధరించి వెళ్లాలి. చిన్న పిల్లలు చలిబారిన పడకుండా శరీరం అంతా దుస్తులు కప్పి ఉంచాలి. ప్రస్తుతం శ్వాసకోశ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువ. మాస్క్ తప్పనిసరిగా ఉపయోగించాలి. గొంతు సంబంధిత వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

– డాక్టర్ బోళం పద్మావతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

రైలులో మర్చిపోయిన బ్యాగ్ అప్పగింత

- బ్యాగ్‌లో బంగారు వస్తువులు



చైన్‌ను కాసులమ్మకు అప్పగిస్తున్న రైల్వే సిబ్బంది

పార్వతీపురం టౌన్: విజయవాడ నుంచి పార్వతీపురం వచ్చిన కోల కాసులమ్మ ఆదివారం రైల్లో మరిచిపోయిన బ్యాగ్‌ను జీఆర్‌పీ, రైల్వే సిబ్బంది ఆమెకు అప్పగించారు. ఈ సందర్భంగా స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బొకారో ఎక్స్‌ప్రెస్‌లో కాసులమ్మ బ్యాగ్ మరిచిపోయిందని పార్వతీపురం స్టేషన్ నుంచి అందుకున్న సమాచారం మేరకు జీఆర్‌పీ సిబ్బందికి తెలియజేశామన్నారు. వెంటనే స్పందించిన జీఆర్‌పీ సిబ్బంది పార్వతీపురం టౌన్‌స్టేషన్‌లో రైలులో తనిఖీ చేసి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని ఆమెకు అప్పగించినట్లు తెలిపారు. ఆ బ్యాగ్‌లో రూ.1.50లక్షల విలువచేసే మూడు తులాల బంగారం చైను, రూ. 5 వేల విలువచేసే వస్తువులు ఉన్నట్లు చెప్పారు. బ్యాగ్‌ను అప్పగించడంతో రైల్వేసిబ్బందికి కాసులమ్మ కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ తనిఖీల్లో జీఆర్‌పీ హెచ్‌సీ రత్నకుమార్, సీతంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వరంగంలోనే బ్యాంక్‌ల పరిరక్షణ సాధ్యం



ఉద్యమ ఐక్యతను తెలియజేస్తున్న బ్యాంకింగ్ ఉద్యోగులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ రంగంలో ఉంటేనే బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉంటుందని, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని ఏఐబీఈఏ, బ్యాంక్స్ ఎంప్లాయీస్ కో ఆర్డినేట్ కమిటీ విజయనగరం ప్రెసిడెంట్ బీవీప్రసాద్, సెక్రటరీ మురళీ శ్రీనివాస్‌లు అన్నారు. ఈ మేరకు స్థానిక అమర్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటీకరణ పేరుతో నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. మొన్నటి వరకు లాభాల్లో ఉన్న ఎల్ఐసీని ప్రైవేట్ పరం చేయడానికి కేంద్రం ప్రయత్నం చేస్తోందని ఇందులో భాగంగానే ప్రభుత్వ వాటాను కొంతమేరకు ఉపసంహరించుకుందని విమర్శించారు. రుణ ఎగవేతదారులకు కేంద్రప్రభుత్వం అండగా నిలుస్తోందని అటువంటి వారి నుంచి వెంటనే మొత్తం రుణాన్ని వసూలు చేస్తే ఏ ప్రభుత్వ రంగ బ్యాంకు కూడా నష్టాల్లో ఉండదని అభిప్రాయపడ్డారు. బ్యాంకులు నష్టాల్లో కూరుకు పోవడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమని ఆరోపించారు. బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలను త్వరితగతిన పరిష్కరించకపోతే ఏఐబీఈఏ ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలు చేసి సాధించుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం పోరాటాల ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బుగత అశోక్, బ్యాంక్ ఎంప్లాయీస్ సంఘం సభ్యులు శ్రావణ్‌కుమార్, రవికుమార్, శ్రీనివాస్ శర్మ, భానోజీరావు, మనోజ్‌కుమార్, వెంకటాచలం, నాగభూషణం, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.